IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com

https://epaper.suryavastavam.com

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

మంగళవారం | 11 జూన్ 2024 | తిరుపతి

సంపుటి 1 | సంచిక 7
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


మోడీ 3.0

## మోడీ క్యాబినెట్ తొలి భేటీ.. 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ జూన్ 10 (సూర్య వాస్తవం) : ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ.. సోమవారం సాయంత్రం తన మంత్రివర్గంతో సమావేశమయ్యారు. 7, లోక్ కల్యాణ్ మార్గ్‌లోని మోదీ నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది. సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని మంత్రి అవాస్ యోజన కింద 3 కోట్ల ఇళ్ల నిర్మాణానికి కేబినెట్ పచ్చజెండా ఊపింది. మూడోసారి ప్రధానిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోదీ.. రైతులకు సంబంధించి పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలి సంతకం చేశారు. దీంతో 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్ల ఆర్థిక సహాయం అందనుంది. కేబినెట్ భేటీకి ముందు పీఎంవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. సమయంతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తించాలని అక్కడి అధికారులకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి వంద రోజుల ప్రణాళికను మోదీ బృందం ఇప్పటికే సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే.

## ఎన్నికల్లో ఘన విజయం.. మొక్కులు తీర్చుకున్న పవన్ కల్యాణ్



అనకావల్లి జూన్ 10 (సూర్య వాస్తవం) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనకాపల్లిలో పర్యటించారు. పట్టణంలో నూకాంబికా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. పిఠాపురంలో తాను గెలిచి కూటమి అధికారంలోకి వస్తే నూకాంబికా అమ్మవారిని దర్శించుకుంటానని అనకాపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పవన్ చెప్పారు. ఈ నేపథ్యంలో సోమవారం అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దఎత్తున జనసేన కార్యకర్తలు, అభిమానులు అక్కడికి తరలివచ్చారు.

## రక్తచరిత్ర రాస్తున్న జగన్: లోకేశ్



**అమరావతి ::** వైఎస్ జగన్ ఓడిపోయినా రక్త చరిత్ర రాస్తూనే ఉన్నాడని మంగళగిరి ఎమ్మెల్యే, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మండిపడ్డారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకి చెందిన టిడిపి నేత గౌరీనాథ్ చౌదరిని దారుణంగా హత్య చేయించారని ఆగ్రహించారు. వైసీపీ ఫ్యాక్షన్ పాలన వద్దని జనం ఛీకొట్టినా, బాబాయ్‌ని చంపినట్టే జనాన్ని చంపుతూ ఉన్నారని ఆరోపించారు. హత్యా రాజకీయాలు ఇకనైనా జగన్ ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గౌరీనాథ్ చౌదరి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితులను వదిలే ప్రసక్తే లేదని, వైసిపి ఫ్యాక్షన్ దాడులకు చెక్ పెడతామని అన్నారు. శాంతిభద్రతలు కాపాడుతామని తెలిపారు.

# బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ

### • పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలిసంతకం

**న్యూఢిల్లీ :** భారత ప్రధానిగా నరేంద్రమోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని సౌత్‌బ్లాక్‌లోని పీఎంఓ కార్యాలయంలో మూడో దఫా తన విధుల్ని మొదలుపెట్టేశారు. ఈ సందర్భంగా రైతులకే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలిసంతకం చేశారు. దీంతో 9.3 కోట్లమంది రైతులకు రూ.20వేల కోట్ల ఆర్థిక సహాయం అందుతుంది. మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం వారి సంక్షేమానికి సంబంధించినదే కావడం విశేషం. రాబోయే రోజుల్లో వ్యవసాయరంగానికి, కర్షకుల సంక్షేమంపై మా ప్రభుత్వం మరింత దృష్టి సారించనుం దని సంతకం చేసిన తర్వాత మోదీ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఈరోజు మోదీ క్యాబినెట్ తొలి సమావేశం జరగనుంది. పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్మును అభ్యర్థించనుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ జరగబోయే సమావేశాల ప్రారంభం రోజున రెండు సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ఈ ప్రభుత్వ దార్శనికత, ప్రాధాన్యతలను పేర్కొంటారు. 2014, 2019 ఎన్నికల్లో విజయం తర్వాత రెండుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. తాజా ఎన్నికల్లో కూటమి విజయదుందుభితో వరసగా మూడోసారి పీఠమెక్కిన ఘనత సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ 2లో



## 12న ప్రధానమంత్రి నరేంద్ర మోడి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: సిఎస్



విజయవాడ,జూన్ 10 (సూర్య వాస్తవం) : ఈనెల 12న కేసరపల్లి ఐటి పార్కు ప్రాంగణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడి పర్యటనకు సంబంధించి కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ తాత్కాలిక టూర్ ప్రోగ్రాం ప్రకారం ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఈనెల 12 ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఉ.10.55 గం.లకు అక్కడ సమీపంలోని ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ప్రధాని నరేంద్ర మోడి మధ్యాహ్నం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ వెళతారని చెప్పారు. కావున ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో పాటు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఇందుకు సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేయాలని స్పష్టం చేశారు. ఇంకా ఈసమావేశంలో 12న జరిగే సియం సహా మంత్రి వర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్ల ప్రగతిని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్షించారు. ఈసమావేశంలో అదనపు డిజిపి ఎస్.బాగ్చి,జిఏడి కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి బాబు ఏ, చీఫ్ కమీషనర్ స్టేట్ ట్యాక్సెస్ గిరిజా శంకర్ పాల్గొన్నారు. అదే విధంగా స్పెషల్ సిఎస్ కె.విజయానంద్, టిఆర్అండ్బి కార్యదర్శి ప్రద్యుమ్న,సిఆర్డిఏ కమీషనర్ వివేక్ యాదవ్,ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు,విజయవాడ పోలీస్ కమీషనర్ పిహెచ్డి రామకృష్ణ, డైరెక్టర్ ఫైర్ సర్వీసెస్ మురళి తదితర శాఖల అధికారులు వర్చువల్ గా ఈసమావేశంలో పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రమాణానికి మోడీ హాజరు

### స్పష్టత ఇచ్చిన ప్రధాని కార్యాలయం - అమిత్ షా సహా పలువురు మంత్రులు, సిఎంల రాక



**అమరావతి** జూన్ 10 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తున్న క్రమంలో ప్రధాని మోడీ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం స్పష్టత ఇచ్చింది. ఈ ప్రమాణ స్వీకారానికి దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులు వస్తున్నట్లు సమాచారం. సీఎం ప్రమాణ స్వీకారానికి సంబంధించి గన్నవరం దగ్గరలోని కేసరపల్లిలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెంన్నాయుడు పరిశీలిస్తున్నారు. అయితే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్‌గా ఉంది. ఈ సస్పెన్స్‌కు పీఎంఓ తెరదించింది. ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతారని పీఎంఓ క్లారిటీ ఇచ్చింది. ప్రమాణ స్వీకారానికి మోదీ వస్తున్నారని ఏపీ ప్రభుత్వానికి పీఎంఓ సమాచారం ఇచ్చింది. మాజీ హోంమంత్రి అమిత్ షా కూడా వస్తున్నట్టు చంద్రబాబు పేషీకి అధికారులు సమాచారం ఇచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రుల హాజరుపై చంద్రబాబు పేషీలోని ఆరా తీస్తునారు. పలువురు కేంద్ర మంత్రులు కూడా ప్రమాణ స్వీకారానికి వస్తామని చంద్రబాబుకు చెప్పినట్టు సమాచారం. గన్నవరం ఎయిర్ పోర్టులో మొత్తం 12 హెలి ప్యాడ్లకు ఏర్పాట్లు చేశారు. ప్రధాని విమానంతో పాటు ఇతరుల విమానాల కోసం కూడా ఎయిర్ పోర్టు ఆథారిటి ఆఫ్ ఇండియా ఏర్పాట్లు చేసింది. వర్షాకాలం కావడంతో ఏర్పాట్లలో జాగ్రత్తగా ఉండాలని సీఎస్ నీరబ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎయిర్ పోర్టు నుంచి ప్రమాణ స్వీకారోత్సవ వేదికకు వీఐపీల కాన్వాయి వెళ్లే దారిలో పటిష్ట బందోభస్తు ఏర్పాటు చేశారు.

## దేశ రాజకీయాల్లో బీజేపీ రాష్ట్ర యువనేత కాకాని తరుణ్ చక్రం తిప్పుతున్నారా..?



విజయవాడ, జూన్ 10 సూర్య వాస్తవం: భారత ప్రధానిగా వరుసగా మూడోసారి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 7 దేశాల అధిపతులు సైతం హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలోనే పలువురు ప్రముఖులు సైతం కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదే కార్యక్రమానికి ఆంధ్ర రాష్ట్ర బీజేపీ యువనేతగా పేరుగాంచిన కాకాని తరుణ్‌కు ఆహ్వానం అందింది. ప్రధాని ప్రమాణ స్వీకార మహోత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి కొంత మందికి మాత్రమే ఆహ్వానం అందింది. వారిలో తక్కువ కాలవ్యవధిలో బీజేపీ రాష్ట్ర రాజకీయ నేతగా పేరుగాంచిన కాకాని తరుణ్‌కు ఆహ్వానం అందడం, దేశ రాజకీయ నేతలతో పరిచయాలు ఉండటం మరింత విశేషం. ఇంకో ఐదు ఏళ్లలో కాకాని తరుణ్ పేరు దేశ రాజకీయాల్లో గట్టిగా వినిపిస్తోందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చలు జరుగుతున్నాయి.

## ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం అవుతున్న జై స్వరాజ్ పార్టీ

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాటాలకు జై స్వరాజ్ సిద్ధం అవుతోందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ వచ్చి పదేండ్లు దాటిన ఇంకా మౌలిక సదుపాయాలైన విద్యా వైద్య ఉపాధి ప్రజలకు అందించే కార్యక్రమాలు ప్రభుత్వ చేపట్టలేదని ఆయన అన్నారు. ఇన్నాళ్లు టీఆర్ఎస్ మాయమాటలతో కాలయాపన చేస్తే, పచ్చి అబద్ధాలతో వచ్చే ఐదేళ్లు వెళ్లబుచ్చే పనిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు కనిపిస్తోందని కేఎస్ఆర్ గౌడ్ వివరించారు. హైదరాబాద్లోని మెట్టు గూడ జై స్వరాజ్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టలేదని, ఎన్నికలు, బడ్జెట్ తదితర కారణాలు చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని కాసాని శ్రీనివాసరావు గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం జనానికి తేటతెల్లం చేయడానికి త్వరలో ఒక కార్యాచరణ చేపడుతున్న ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను కేఎస్ఆర్ గౌడ్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి యామిని లక్ష్మి, పార్టీ జాతీయ కార్యదర్శి ఆర్ ఎస్ జే థామస్ , పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గోలుకొండ రత్నం, , తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుషరాములు గౌడ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రామ్మూర్తి, రాష్ట్ర నాయకుడు సుగూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

### -మందమరి ఏరియా జిఎం మనోహర్

మందమర్రి జూన్ 10 (సూర్య వాస్తవం) : మందమర్రి ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరూ అంకితభావంతో పనిచేయాలని ఏరియా జిఎం మనోహర్ తెలిపారు. సోమవారం ఏరియాలోని శాంతి కానీ దానిని సందర్శించారు. గణికి సంబంధించిన ప్లాన్లను పరిశీలించారు. రోజువారీగా సాధిస్తున్న ఉత్పత్తి లక్ష్యాలను గని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద రహిత ఉత్పత్తి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అధికారులు ఉద్యోగులు విధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహించాలని కోరారు. పని స్థలాలను పక్క పర్యవేక్షణ చేయాలని ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి ఉద్యోగులు తీసుకువెళ్లాలని చెప్పారు. విధి నిర్వహణలో తొందరపాటు చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సమస్త మనది అనే భావనతో పని చేస్తే సత్ఫలితాలు సాధిస్తామని చెప్పారు. గనులలో ప్రమాదాల నివారణకు సంబంధించి పగడ్బందీ సాంకేతిక రక్షణ చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. సమిష్టి కృషితో ఉద్యోగులు అధికారులు పరస్పరం సహకరించుకుంటూ విధినిర్వహణలో ముందుకు సాగితే అభివృద్ధికి ఏలాంటి డోకా ఉండదని చెప్పారు. అనంతరం గనిలో దిగి పని స్థలాలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శాంతి కని ఏజెంట్ విజయ ప్రసాద్. గని మేనేజర్ సంజయ్ కుమార్ సి హ్నా. గ్రూపు ఇంజనీర్ బసవరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలి

సిద్దిపేట జూన్ 10 (సూర్య వాస్తవం) : సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయి వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, డీఆర్డీఏ పిడి జయదేవ్ ఆర్యా, వివిధ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం ఆటపాటలతో బోధన

ఆళ్లగడ్డ జూన్ 10 (సూర్య వాస్తవం) : అంగన్వాడి బడిబాట కార్యక్రమం చిన్నారుల జీవితానికి పూలబాట అవుతుందని అంగన్వాడీ టీచర్ మౌనిక తెలిపారు.సోమవారం ఆళ్లగడ్డ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఒకటవ అంగన్వాడి కేంద్రం టీచర్ మౌనిక ఆధ్వర్యంలో అంగన్వాడి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమంలో చిన్నారులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతొ కలసి ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాలలో రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్లలోపు బడియుడు పిల్లల్ని తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త మౌనిక మాట్లాడుతూ చిన్నారులకు మానసిక శారీరక వృద్ధి ,వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పౌష్టికాహారం, ఆట పాటలతో కూడిన విద్య, సామూహిక అక్షరాభ్యాసాలు, పాలు గుడ్డు ఒకపూట సంపూర్ణ ఆహారం తమ అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్నామని తెలిపారు.తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

# బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలి

- సమస్యలను కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకుపొవాలి
- ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ శేఖర్..

కడప, సూర్య వాస్తవం: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు అండగా నిలబడాలని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ శేఖర్ పిలుపునిచ్చారు, సోమవారం వైయస్సార్ కడప మాల మహానాడు నగర అధ్యక్షులు చెంచుల దేవిడ్ సత్యరాజు ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల లో విజయ శేఖర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు పూల మాలలు వేసి, శాలువాతో సత్కరించారు, భారీ కేక్ ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు, అనంతరం ఆయన మాట్లాడుతూ తన జన్మదినోత్సవ సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన మాల మహానాడు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు, రాష్ట్రంలో నూతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు, కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కి కృషి చేయాలని ఆకాంక్షించారు, అణగారిన వర్గాలు, బహుజనుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.వైఎస్సార్ కడప మాల మహానాడు నగర అధ్యక్షులు చెంచుల దేవిడ్ సత్య రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బడుగు జీవులు, అణగారిన వర్గాల పక్షాన పోరాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ శేఖర్ మరిన్ని జన్మదినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు, ఆయన స్ఫూర్తితో తామంతా ముందుకు వెళ్తామని తెలిపారు, ప్రభుత్వం అందించే పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారని కోరారు, సంఘంలో ఉన్న ప్రతి ఒక్కరు నీతి, నిబద్ధతతో పనిచేసి పేదల గొంతుక గా మారాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఏపి మాల మహానాడు నాయకులు కానాల క్లెమెంట్ రాజు, చెంచుల ఎబినేజర్, వర్రా శ్యామ్,తేజ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు..



# మోడీ కేబినేట్‌లో చేరడం అదృష్టం

### -దుష్ప్రచారాలను నమ్మొద్దన్న మంత్రి సురేశ్ గోపి



న్యూఢిల్లీ, జూన్ 10 (సూర్య వాస్తవం) : మోడీ కేబినేట్‌లో చేరడం ఓ అదృష్టమని కేరళ బిజెపి నుంచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు సురేశ్ గోపి అన్నారు. కొన్ని మీడియా ప్లాట్ ఫామ్స్‌లో తనపై అప్పుడే దుష్ప్రచారాలు మొదలు పెట్టామని అన్నారు. తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలను కేంద్రమంత్రిసురేశ్ గోపి ఖండించారు. కేంద్రమంత్రివర్గం నుంచి తాను రిజైన్ చేస్తారంటూ వస్తున్న వార్తలను తప్పు బట్టారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేరళ అభివృద్ధి చేసేందుకు తాము కలిసి కట్టుగా ఉన్నామని ట్వీట్ చేశారు. లోక్ సభ ఎన్నికల్లో కేరళలోని త్రిస్సూర్ ఎంపీగా గెలుపొందారు. దీంతో తొలిసారి మోదీ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 'కొన్ని మీడియా సంస్థలు తాను కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానంటూ తప్పుడు వార్తను ప్రచారంలోకి తెచ్చాయి. అది పూర్తిగా అబద్ధం. ప్రధాని మోదీ నాయకత్వంలో కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని తాము కృతనిశ్చయంతో ఉన్నాం' అని సురేష్ గోపి తన పోస్టులో తెలిపారు. కాగా కేరళ నుంచి బీజేపీ తొలి లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన సురేష్ గోపీ త్రిస్సూర్‌లో 74 వేల ఓట్లతో విజయం సాధించారు. లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యే ముందు సురేష్ గోపీ 2022 వరకు రాజ్యసభ ఎంపీగా కూడా ఉన్నారు. ఆయన రాజ్యసభకు నామినేట్ అయ్యారు. కేంద్ర మంత్రిగా సురేష్ గోపి ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానిగా మోదీ మూడోసారి ఆదివారంన ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్డీయేలోని మిత్ర పక్షాలకు 11 మందికి మంత్రి పదవులు దక్కాయి. కేంద్ర మంత్రుల్లో 43 మంది పార్లమెంట్‌లో మూడు పర్యాయాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పనిచేసిన వారు కాగా, 39 మంది ఇంతకు ముందు కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారు.

## నియోజకవర్గ ప్రజల రుణం మరువరానిది, కొరముట్ల



రైల్వే కోడూరు, సూర్య వాస్తవం: రైల్వే కోడూరు స్థానిక వైయస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ జీవితాలలో గెలుపు ఓటములు సర్వసాధారణమేనని కోడూరు తాజా మాజీ ఎమ్మెల్యే అన్నారు. తాను మొన్న జరిగిన ఎన్నికలలో ఓటమి జరిగిన విషయం విధితమే. అయితే నియోజకవర్గ ఓటర్లు తన పట్ల ఆదరాభిమానాలు చూపించారని ఆయన అన్నారు. ముఖ్యంగా గెలిచిన వారికి అభినందనలు అని, అభివృద్ధిలో పోటీపడి పనిచేసి మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన తెలిపారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో తాను పనిచేసిన అన్ని రోజులు అభివృద్ధిని సాధించానని తెలియజేశారు. ముఖ్యంగా రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఓటర్లు దాదాపు 60000 వచ్చాయంటే ఎంతో అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామని అన్నారు. రాజకీయాలలో సర్వ సాధారణంగానే గెలుపోవటములను సమానంగా స్వీకరించాలని కక్ష సాధింపులు తదితర వాటికి స్వస్తి పలకాలని శ్రీనివాసులు అన్నారు. తాను చేసిన పనులలో పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. తనకు సహరించిన నాయకులు కార్యకర్తలకు ఎప్పుడూ రుణపడి ఉంటారని ఆయన అన్నారు. 2029 లో గెలుపుకు శ్రీకారం చుట్టాలని ఆయన పాల్గొన్న వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు సిహెచ్ రమేష్, , సర్పంచులు దార్ల చంద్రశేఖర్, ఆనాల చంగల్ రెడ్డి, వైయస్ కరిముల్లా, షఫీ, సలాం, రాజా, కె రమణారెడ్డి, డి రాజారెడ్డి కృష్ణారెడ్డి మారెళ్ళ రాజేశ్వరి, ప్రతాపరెడ్డి శివారెడ్డి, సుధాకర్ రాజు, కుప్పాల జ్యోతి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

### -జిల్లా కలెక్టర్ షేక్ యాష్మిన్ భాషా



జగిత్యాల,జూన్ 10 (సూర్య వాస్తవం) : పాఠశాలలు పునః ప్రారంభం కానున్న దృష్ట్యా తరగతి గదులు శుభ్ర పరచడం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరగాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం పాఠశాలల పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడం, పాఠ్య , నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరగాలని అన్నారు. అదేవిధంగా వసతి గృహాల్లో కూడా అన్ని శుభ్రం చేయించాలని, గత సంవత్సరం పాఠశాలలు ముగింపు సమయంలో మిగిలి పోయిన బియ్యం, తదితర సామాగ్రి ఈ సంవత్సరం వాడకుండా కొత్తగా ఇండెంటు సమర్పించి సరుకులు తీసుకోవాలనీ ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, తదితర విద్యా సంస్థల జిల్లా అధికారులకు సూచించారు. పాఠశాలలు, విద్యాసంస్థలు, వసతి గృహాలు లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ముందస్తు సరుకు తీసుకునే ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను ఆయా మండలాల వారీగా, పాఠశాలల వారీగా పాఠశాలలు ప్రారంభ నాటికి పంపించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలాల్లో పర్యటించి పాఠశాలల పునః ప్రారంభం సమయంలో పాఠశాలలను తనిఖీ చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాలను పరిశీలించాలని సూచించారు. అదేవిధంగా మిషన్ భగీరథ సర్వే పనులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, పి.రాంబాబు, ఆర్డీఓ లు పి. మధుసూదన్, శ్రీనివాస్, జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న 13 అసెంబ్లీ సీట్లకు ఉపఎన్నికలు

న్యూఢిల్లీ జూన్ 10 (సూర్య వాస్తవం) : ఖాళీగా ఉన్న 13 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు నిర్వహిస్తామని సోమవారం ప్రకటించింది. ఖాళీగా ఉన్న అసెంబ్లీ సీట్లు ఇలా ఉన్నాయి..బీహార్ (1), పశ్చిమబెంగాల్ (4), తమిళనాడు(1), మధ్యప్రదేశ్ (1), ఉత్తరాఖండ్(2), పంజాబ్(1), హిమాచల్ ప్రదేశ్(3). జులై 10న వీటికి ఉపఎన్నికలు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు జులై 13న జరుగనున్నది.

ఉపఎన్నికల షెడ్యూల్

నామినేషన్ ల దాఖలు చివరి తేదీ: జూన్ 21,నామినేషన్ల పరిశీలన: జూన్ 24,అభ్యర్థుల ఉపసంహరణ చివరి తేదీ: జూన్ 26,పోలింగ్ తేదీ: జులై 10,ఫలితాలు: జులై 13.ఉపఎన్నికలు అనేవి అధికారంలో ఉన్న అభ్యర్థి రాజీనామా చేసినా లేక చనిపోయినా ఏర్పడిన ఖాళీ స్థానానికి జరుగుతాయి.

## బండి సంజయ్ , కిషన్ రెడ్డిలకు అభినందనలు

న్యూ డిల్లీ జూన్ 10 (సూర్య వాస్తవం) : ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో ఏర్పాటైన ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా అవకాశం పొందిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ని ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపిన బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, దన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి. మండలి సభాపక్ష నేత కీవీఎలెన్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావ్ పటేల్, పాల్వాయి హరీష్ బాబు తదితరులు

## బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ

మొదటి పేజీ తరువాయి

తర్వాత దేశంలో వరసగా మూడోసారి ప్రధాని అయిన ఘనతను సొంతం చేసుకున్నారు. తాజా కేంద్ర సర్కార్ 71 మంది మంత్రులతో కొలువుదీరింది. అందులో 30 మంది క్యాబినెట్ మంత్రులుగా ఉన్నారు.భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని పార్లమెంట్ సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఆయన మూడోసారి తన విధుల్ని నిర్వర్తించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పీఎంవో లోని ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం ఆయన మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు.తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు. 'రాబోయే కాలంలో రైతులు, వ్యవసాయ రంగానికి మరింత కృషి చేస్తాం. మాది కిసాన్ కళ్యాణ్‌కు పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం.. అందువల్ల బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంతకం చేసిన రైతు సంక్షేమానికి సంబంధించినది కావడం సముచితం.' అని ప్రధాని పేర్కొన్నారు.

## వైసీపీ కార్యకర్తలపై బెదిరింపులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదు..

దేవనకొండ ,జూన్ 10 (సూర్య వాస్తవం) : దేవనకొండ మండలం కేంద్రంలో శ్రీ లక్ష్మి రంగా కళ్యాణ మండపంలో రసూల్ కుమారుడు వివాహానికి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి, మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. తదనంతరం ఎమ్మెల్యే వీరుపాక్షి వైసీపీ మండల నాయకులతో కార్యకర్తలతో సమావేశమయ్యారు.

## టిజిపిఎస్సి వెబ్‌సైట్‌లో గ్రూప్-4 మెరిట్ జాబితా విడుదల

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో గ్రూప్ 4 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టిజిపిఎస్సి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ధృవపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులు అవసరమైన సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని కమిషన్ తెలిపింది. టిజిపిఎస్సి కార్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఈ నెల 13 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపింది. త్వరలోనే రోజువారీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని పేర్కొంది. రాష్ట్రంలో 8,180 గ్రూప్- 4 ఉద్యోగాల భర్తీకి గతేడాది జులై ఒకటో తేదీన రాతపరీక్ష నిర్వహించి, ఈ ఏడాది ఫిబ్రవరి 9న మెరిట్ జాబితాను టిజిపిఎస్సి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో త్వరలోనే గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్సి వెల్లడించింది.

## సివిల్ సప్లై కార్యాలయం ముందు హమాలీల నిరసన

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : పంజాగుట్ట ఎర్రమంజిల్ కాలనీలోని పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం వద్ద హమాలీలు తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని నిరసన చేపట్టారు . పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలి రేట్లు పెంచాలని ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని హమాలీలకు ప్రాఫిడెంట్ ఫండ్ పెన్షన్ సౌకర్యం కల్పించాలని హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ పథకాన్ని సంపూర్ణంగా రద్దుచేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేస్తున్న హమాలీలను పోలీసులు అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. తాము కమిషనర్ను కలిసిన తర్వాతే ఇక్కడి నుంచి వెళ్తామని కూర్చున్నారు. అదే సమయంలో కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న కమిషనర్ వారి వద్దకు వచ్చి వినతి పత్రాన్ని స్వీకరించారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన విరమించారు.

## మధుగురు అక్షర యజ్ఞం కరపత్రాన్ని విడుదలచేసిన డా. పింగిళి విజయపాల్ రెడ్డి

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : పిల్లలకు ఉన్నత చదువులు పెద్దలకు ఉపాధి మార్గాలూ అందించాలన్న సంకల్పంతో జూకల్ గ్రామ కేంద్రంగా రౌతు మధుకర్ అద్వర్యంలో నిర్వహించబడుతున్న మధుగురు అక్షర యజ్ఞం కరపత్రాన్ని డా. పింగిళి విజయపాల్ రెడ్డి తమ నివాసములో ఆవిష్కరించారు. అక్షరయజ్ఞం లో భాగంగా 10 వ తరగతి వరకు చదువుతున్నా పిల్లలకు కలిగే విద్య పరమైనస సందేహాలను ఫోన్ ద్వారా నివృత్తి చేయడానికి ఉత్తమ బోధకులచే జాతీయ స్థాయిలో ఫోన్ ద్వార విద్యా బోధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్యక్రమంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు 9491504405 కు తమ వివరాలు పంపగలరని యజ్ఞం నిర్వహకులు రౌతు మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ రావు ,బాలకృష్ణ ,పోనగంటి బాలకృష్ణ పాల్గొన్నారు.

## కడప ప్రజలు బాగుండాలని ప్రార్ధన



కడప ప్రత్యేక ప్రతినిధి, సూర్య వాస్తవం: పవిత్ర స్థలం మక్కా హజ్ చేసే దానికి వెళుతున్న శుభ సందర్భంగా తులసి గ్రూప్స్, తులసి బీడీ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ మరియు జమాయితుల్లా ఉలూమ్ అసనియా అరబిక్ కాలేజ్ ప్రెసిడెంట్ అల్ హజ్ షేక్ కుద్రుతుల్లాయ్‌ని కలిసిన కడప నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అఫ్జల్ ఖాన్ కడప ప్రజల కోసం ప్రార్థించ వలసినది కోరుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.


## ఘనంగా నందమూరి బాలకృష్ణ 64వ పుట్టినరోజు వేడుకలు



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : అంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రముఖ సినీ నటుడు హిందూపురం శాసనసభ్యు లు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు ఐ ఎమ్ ఎమ్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పేదలకు ఉచిత కాన్సర్ వైద్యం అందిస్తున్న మహోన్నత సేవాతత్పరుడు నందమూరి బాలకృష్ణ అని అన్నారు. హిందూపురం శాసనసభ్యుడిగా హ్యాట్రిక్ విజయం అందుకున్న ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారాం, కృష్ణ కుమార్, శ్రీధర్, లక్ష్మీనారాయణ ,అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు

## సంస్మరణ కార్యక్రమానికి హాజరైన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

జి.కొండూరు, సూర్య వాస్తవం: జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన చనమోలు సత్యన్నారాయణ సంస్మరణ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యు లు వసంత వెంకట కృష్ణప్రసాదు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్ధించారు. ఆయన కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. చనమోలు రాము తదితరులు ఎమ్మెల్యేతో పాటు ఉన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించడమే నా ఏకైక లక్ష్యం

### – టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్ రాయులు



రైల్వే కోడూరు/చిట్వేల్ సూర్య వాస్తవం: రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేల్ మండలం మాలేమార్పురం పంచాయతీ ఈడిగపల్లి గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బత్యాల చంగల్ రాయలు ఆ గ్రామానికి విచ్చేయగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి పలువురు తీసుకు వచ్చారు. మా చుట్టుపక్కల గ్రామాలకు త్రాగునీరు, సాగునీరు లేక నీటి కొరత ఏర్పడిందని ఆ కొరతను ఎలాగైనా మీరే తీర్చాలని బత్యాల కి వారి గోడు వెలబుచ్చుకున్నారు. ఆ సమస్య తీరాలంటే ఏం చేయాలనే విషయంపై గ్రామస్తులతో చర్చించి ముందుగా పెనగలూరు మండలం రేగుంటపల్లె చెరువు వద్దకు వెళ్లి ఆ చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు చెప్పిన విధంగా రేగుంటపల్లి చెరువు చిన్నపాటి వర్షానికి కూడా నిండిపోయి ఆ నీరంతా వృధాగా గుంజినేరులో కలిసిపోతుందని., ఈ చెరువుపై 10 లక్షలు ఖర్చు చేయగలిగితే దీనికి సమీపంలో ఉన్న చిట్వేల్ మండలంలో ఉన్న గరువుపల్లి చెరువుకి కాలువ ఏర్పాటు చేస్తే ఈ నీరంతా ఆ చెరువులో చేరి చుట్టుపక్కల ఉన్న చిట్వేల్ మండలం కట్టావారిపల్లి, మాలేమార్పురం గ్రామపంచాయతీలోని పది గ్రామాలకు వ్యవసాయానికి నీరు అందడమే కాకుండా, గ్రౌండ్ వాటర్ లెవెల్ కూడా పెరుగుతుందని అన్నారు. గతంలో కూడా ఈ రేగుంటపల్లి చెరువుకి కోటి రూపాయలు మంజూరు చేయించా కానీ ఒకరిపై ఒకరు పోటీలు వేసుకొని పని చేయలేదని. ఈసారి అలా కాకుండా గ్రామస్తుల ద్వారా పూర్తి చేస్తామని అన్నారు. ఈ విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యని తీర్చే దానికి ప్రయత్నం చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ఎంపీటీసీ కస్తూరి శ్రీనివాసులు నాయుడు, కొల్లపనేని హరి, పొల్లోపల్లి ఎంపీటీసీ కృష్ణయ్య యాదవ్, నారాయణ యాదవ్, ఎదిగపల్లి కోటయ్య, మందా విశ్వనాథ్, కొల్లా రామంజులు, కట్టా శంకరయ్య, మహేష్ నాయుడు, వెంకటేష్ ఇంకా పలు గ్రామాల రైతులు తది తరులు పాల్గొన్నారు.

# టీడీపీ అరాచకాలపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను

### – దాడులకు ప్రతి దాడులు తప్పవు



జగ్గయ్యపేట, 10 జూన్ (సూర్య వాస్తవం) : వైసీపీ కార్యకర్తలపై దాడులు, అస్తుల ధ్వంసం అమానుషం. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏనాడు దాడులను ప్రోత్సహించలేదని విలేకరుల సమావేశంలో వెల్లడి. టీడీపీ దాడులకు ప్రతి దాడులుంటాయని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను హెచ్చరించారు. నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు, ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చేయడంపై ఆయన మండిపడ్డారు. సోమవారం జగ్గయ్యపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వైసీపీ ముఖ్య నాయకులతో కలిసి ఉదయభాను విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇకనుంచి దాడులు ఆపకపోతే ప్రతి దాడులకు సైతం తాము వెనకాడబోమని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ వాళ్ళ వికృత చేష్టలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఏనాడూ దాడులను ప్రోత్సహించలేదని చెప్పారు. వైసీపీ కార్యకర్తలను విచక్షణరహితంగా కొట్టడం, ఇళ్ళపై రాళ్ళు విసిరి విలువైన వస్తువులను ధ్వంసం చేయడం, శిలాఫలకాలు, పార్టీ జెండా దిమ్మెలను కూల్చడం వంటి చర్యలపై ఉదయభాను ఆందోళన వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట తెలుగుదేశం నాయకులు తక్షణమే స్పందించి దాడులను ఆపించాలని అన్నారు. కార్యకర్తలను అదుపులో ఉంచుకోవాలని చెప్పారు. దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిందితులకు 41ఏ నోటీసు ఇచ్చి పంపిస్తున్నారని, ఇలాగైతే శాంతిభద్రతలు ఎలా అదుపులో ఉంటాయని ప్రశ్నించారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలపై ఎక్కడెక్కడ దాడులు జరిగాయో, అస్తులు, శిలాఫలకాలు, జెండాదిమ్మెల ధ్వంసం వంటి ఘటనలను ఆయన వివరిస్తూ ఫొటోలను ప్రదర్శించారు. వైసీపీ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఉదయభాను భరోసానిచ్చారు. ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని, తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన శ్రీరాం రాజగోపాల్ కి ఉదయభాను అభినందనలు తెలిపారు.

# మైనార్టీలకు అండగా టిడిపి నాయకులు

### – పశ్చిమ ఇబ్రహీంపట్నంలో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో టిడిపి విజయోత్సవం







ఇబ్రహీంపట్నం సూర్య వాస్తవం: టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడు మైనార్టీలకు అండగా ఉంటుందని, చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని తెలిపారు తెలుగుదేశం పార్టీ నాయకులు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం 20వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఘనవిజయాన్ని పురస్కరించుకొని విజయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, మున్సిపాలిటీ టిడిపి చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు, మండల అధ్యక్షుడు రామినేని రాజా, కౌన్సిలర్ చనుమొలు నారాయణ పాల్గొన్నారు. స్థానిక జండా సెంటర్ చెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం మసీదు సెంటర్లో భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద ముస్లింకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, మైనార్టీల అభివృద్ధి మరియు సంక్షేమం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని తెలిపారు. స్థానిక ముస్లిం నాయకులు మాట్లాడుతూ గత పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎన్నో సంక్షేమ పథకాలు రద్దు చేయబడినయని, వాటి పునరుద్ధరణతో మళ్ళీ ముస్లింలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. అతిథులను ముస్లిం సోదరులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ముస్లిం నాయకులు షేక్ సర్వర్ సాహెబ్, ముస్తఫా, షకీల్, కరీముల్లా,గాల్షిద్, మహబూబ్ సుభాని,రఫీ, షరీఫ్,హజారి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపికి వెన్నుదన్నుగా నిలిచిన ముస్లిం మైనార్టీలు

### – కొండపల్లి హజ్రత్ సయ్యద్ షాబుఖారి దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు







ఇబ్రహీంపట్నం, సూర్య వాస్తవం: గడచిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కమ్ముకున్న కారు చీకట్లో వీడిపోయి ప్రజాపాలన వచ్చిందని, ఈ పోరాటంలో టిడిపికి ముస్లిం మైనార్టీలు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారుక్ షుబ్లీ. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబునాయుడుకు అల్లా ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ కొండపల్లి లోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారీ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మషాయక్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ జకావుద్దీన్ తో కలిసి సోమవారం దర్గాని సందర్శించారు. ఆస్థాన పీఠాధిపతి మరియు హజ్రత్ సయ్యద్ షాబుఖారి బాబా నిత్య అన్నదాన లంగర్ ఖానా నిర్వాహకులు అల్తాఫ్ బాబా వారిని సాదరంగా ఆహ్వానించారు. దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఫారుక్ షుబ్లీ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 సంవత్సరాలుగా నెలకొన్న కారు చీకట్లు వీడిపోయి, ప్రజలు కోరుకున్న ప్రజాపాలన వచ్చిందన్నారు. ఈ పోరాటంలో ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసిన ముస్లిం మైనార్టీలు మాత్రం చంద్రబాబుకు వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. చంద్రబాబు పాలనలో మైనార్టీలకు తప్పకుండా పెద్దపీట వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక మైనారిటీలు మాత్రమే కాకుండా చంద్రబాబు పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, అన్ని వర్గాలకు మంచి జరుగుతుందని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్న సందర్భంగా కొండపల్లి దర్గాలో చంద్రబాబు ప్రభుత్వానికి అల్లా ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రం, చంద్రబాబు పాలన సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు. ఇక్కడ జరుగుతున్న నిత్య అన్నదాన లంగర్ ఖానాలో కుల, మతాలకు అతీతంగా అందరికీ ఉచిత అన్నదానం చేయటం ఎంతో మంచి కార్యక్రమం అని అల్తాఫ్ బాబాను ప్రశంసించారు. జకావుద్దీన్ మాట్లాడుతూ చంద్రబాబు సెక్యులర్ భావాలు గల నాయకుడు అని, ఆయన మైనార్టీలకు తప్పకుండా న్యాయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సర్వర్ సాహెబ్ (గోరే), మైలవరం నియోజకవర్గ ముస్లిం ఉపాధ్యక్షులు మహబూబ్ సుభాని, అప్సర్, మొయిన్, బాబు షేక్, సలీం, సయ్యద్ షా మొహమ్మద్ తాహేరుల్లా ఖాదరి, సయ్యద్ షా సిరాజుద్దీన్, గులాం రసూల్, బాషా తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమలో మంత్రి పదవులపై హైకమాండ్ వద్ద పైరవీలు

అమలాపురం జూన్ 10 (సూర్య వాస్తవం) : ఎన్నికల ఫలితాల తర్వాత నియోజకవర్గంలో అందుబాటులో లేకుండా విజయవాడ,హైదరాబాద్ లోనే వుంటూ మంత్రి పదవి కోసం పలువురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఏడు కు ఏడు స్థానాలలో టీడీపీ,బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు గెలిచిన విషయం తెలిసిందే. కులాలు, సీనియారిటీ వారిగా మంత్రి పదవి నాకు వస్తుంది అంటే నాకు వస్తుంది అంటూ ధీమా వ్యక్తం చేస్తున్న పలువురు ఎమ్మెల్యేలు. మరో రెండు రోజుల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విజయవాడ, హైదరాబాద్ లోనే మకాం వేసి పలువురు ఎమ్మెల్యేలు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుండి సీనియర్ నేత అమలాపురం టీడీపీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కు మంత్రి పదవి అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంఇ. కాపు సామాజిక వర్గం నుండి కొత్తపేట టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు దాదాపు మంత్రి పదవి ఖరారు అయింది, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కి కూడా మంత్రి పదవి అంటూ జిల్లలో జోరుగా ప్రచారం జరుగుతోంది. పార్టీ అధిష్టాన పెద్దల వద్ద మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు విశ్వ ప్రయత్నలు చేస్తున్నారు.

## కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్..

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : న్యూస్); కేంద్రంలో నరేంద్రమోడీ సారధ్యంలో ఏర్పడిన కొత్త మంత్రి వర్గంలో తెలంగాణ, ఆంధ్రపదేశ్ రాష్ట్రాల నుంచి ఐదుగురు ఎంపిలు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగిన ప్రమాణస్వీకారోత్సవంతో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీరితో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి విజయం సాధించిన జి.కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి గెలుపొందిన బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు.ధ్రప్రదేశ్ నుంచి ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నుంచి శ్రీకాకుళం ఎంపిగా గెలిచిన కింజరపు రామ్మోహన్ నాయుడు ఇంగ్లీషులో ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో విజేతగా నిలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సహాయ మంత్రిగా, బిజెపి నుంచి నరసాపురం పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## తలసానిని పరామర్శించిన హరీష్ రావు

హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మరణించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు,శంకర్ యాదవ్ భౌతిక కాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బోయిన్ పల్లి మార్కెట్ అధ్యక్షుడిగా శంకర్ యాదవ్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఎమ్మెల్యే పుట్టాను కలసిన పెద్ద జొన్నవరం తెదేపా నాయకులు

– ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన వెంకటేశ్వర రెడ్డి



దువ్వూరు, సూర్య వాస్తవం: మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను దువ్వూరు మండల తెదేపా నాయకులు కలిశారు.సోమవారం మండల పరిధిలోని పెద్ద జొన్నవరం గ్రామానికి చెందిన ఎన్. వెంకటేశ్వరరెడ్డి,మండల తెలుగుయువత అధ్యక్షులు యన్.రాజశేఖరరెడ్డి, ప్రొద్దుటూరు పట్టణం లోని పుట్టా సుధాకర్ యాదవ్ స్వగృహంలో కలిశారు.పెద్ద జొన్నవరం గ్రామానికి చెందిన టీడీపి నాయకులు నల్లదిమ్మగారి వెంకటేశ్వరరెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు యన్. రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో పెద్దజోన్నవరం గ్రామానికి చెందిన పెద్ద ఎత్తున యూత్ ,కార్యకర్తలు మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ను కలసి అబినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ను ఘనంగా సన్మానించినట్లు మండల తెలుగు యువత అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

## కృషితో నాస్తి దుర్భిక్షం



కృషి ఉంటే మను షులు రుషులవు తారు. మహా పురుషులవుతారు. ఇది అక్షరాలా నిజం అని నిరూ పించిన నిరంతర కృషీ వలుడు, కేంద్ర గ్రామీణా భివృద్ధి, సమా చార శాఖ సహా య మంత్రి, గుంటూరు జిల్లా, తెనాలి వాసి, పెమ్మసాని చంద్రశేఖర్ కు ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.

మధిర.భగత్ సింగ్ , ఎంపిటిసి కట్టేవరం.
కల్పన .మధిర (న్యాయవాది):
మధిర. రామకిషన్ సింగ్ (ఏపీ.పోలీస్)

## బంగారు పతక విజేతలకు కలెక్టర్ అభినందన



అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, జూన్ 10 (సూర్య వాస్తవం) : జాతీయ స్థాయి పరుగు పోటీలలో బంగారు బహుమతులు గెలుచుకున్న ఇద్దరు క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అభినందించారు. ఇటీవల మే 25 నుండి 28 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి లో ఖేలోభారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందాలు పోటీలలో పాడేరు నుండి కొర్రా గోపి, కిల్లోబుద్దు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి పొందినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన్ పేర్కొన్నారు. కొర్రా గోపి 5 కిలో మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి బంగారు పతాకాన్ని, కిల్లోబుద్దు 10 కిలోమీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానం సాధించి బంగారు పతాకాన్ని కైవసం చేసుకున్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతను సోమవారం తన చాంబర్ లో కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాదికారి ఎ. జగన్మోహన్ రావు పాల్గొన్నారు.

## వరదరాజుల రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి



ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: మండలంలోని కామనూరు గ్రామంలో సోమవారం మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజు రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలుపొంది అందరి మన్ననలు పొందుతున్న, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వరదరాజుల రెడ్డికి ఈసారి నూతన మంత్రివర్గంలో ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ప్రొద్దుటూరు నియోజవర్గానికి ఇంతవరకు మంత్రి పదవి దక్కలేదని, ఈసారి వరదరాజుల రెడ్డికి మంత్రిగా అవకాశం కల్పించాలని ఆయన కోరారు. అలాగే పట్టణంలో మార్కెట్ త్వరగా పూర్తి చేసి పాతవారికి వారి బండలను వారికి అప్పగించాలని అలాగే పట్టణంలో ఎన్నో సమస్యల పైన దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి ఉపాధ్యక్షులు బిటెక్ బాషా, షేక్ సలీం, సహాయ కార్యదర్శి ముస్తఫా, ట్రెజరర్ మెహమూద్, సభ్యులు రమేష్, చరణ్, మునయ్య, యూసుఫ్, ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్య కృషీ వలుడు ప్రధాని నరేంద్రమోడీ

- కేంద్రంలో మూడవసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీ
- భాజపా జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి



పులివెందుల అర్బన్, సూర్య వాస్తవం: నిత్య కృషీ వలుడు ప్రధాని నరేంద్రమోడీ కేంద్రంలో 3వ సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భంగా నరేంద్రమోడీ కి శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందని భాజపా జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో భాజపా కు సుదీర్ఘంగా పరిపాలన చేసేందుకు అవకాశం కల్పించి ప్రజలకు ధన్యవాదాలు తెలియ చేస్తూ, దేశంలో దశాబ్దాల కాలం నాటి నుండి అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఘనత నరేంద్రమోడీకి దక్కుతుందని, ఆర్టికల్ 370 రద్దు, అగ్రవర్ణ పేదలకు 10% శాతం రిజర్వేషన్, రామ మందిర నిర్మాణం, నోట్ల రద్దు, ట్రిపుల్ తలాక్ ,రద్దు లాంటి ఎన్నోసాహసోపేతమైన నిర్ణయాలతో దేశ సంక్షేమం కోసం పాటుపడిన నిత్య కృషివలుడు మోడీ అని పేర్కొన్నారు. దేశంలో గత 10 సంవత్సరాలుగా అభివృద్ధి సంక్షేమం తో పాటు ఎలాంటి ఉగ్రదాడులు జరుగకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని. ప్రపంచం లోనే అతి పెద్ద రాజకీయ పార్టీ భాజపా అని, దేశంలో 40 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించడం జరిగిందని అన్నారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతపురం డిప్యూటీ మేయర్.....

– కల్వర్టు పనులు, ప్రధాన రహదారి ఆక్రమణల పై చర్చ



అనంతపురం క్రైమ్ ( సూర్య వాస్తవం) : సోమవారం నాడు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు అనంతపురం డిప్యూటీ మేయర్ దాసరి వాసంతి సాహిత్య. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఆయన్ను కలిసి పలు సమస్యలు పైన చర్చించారు. ప్రధానంగా త్రివేణి థియేటర్ సమీపంలో ఉన్న కల్వర్టు పనులు,సూర్య నగర ప్రధాన రహదారి ఆక్రమణల గురించి వివరించారు. సమస్యల పైన సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నగరాన్ని అభివృద్ధి చేయాలి అని డిప్యూటీ మేయర్ కు కలెక్టర్ సూచించారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



గుంతకల్లు ప్రతినిధి , సూర్యా వాస్తవం: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుక సందర్భంగా సోమవారం గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మలూరు జయరాం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఎంతో ఆప్యాయంగా అందరి మననును దోచుకుని ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే అయ్యి నందమూరి వంశంలోనే నేను ప్రజాసేవ కోసం పుట్టానని రాష్ట్రం నలుమూలల ప్రచారాలు చేస్తున్నటువంటి నందమూరి బాలకృష్ణ ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నారు ఈ కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు లింగన్న వెంకటేష్ హనుమేష్ శ్రీనివాసులు మేకల జై చంద్ర తెలుగుదేశం పార్టీ నాయకులు బాలకృష్ణ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అనిత ఐ క్లినిక్ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



పరవాడ, జూన్ 10 (సూర్య వాస్తవం) : పరవాడ గ్రామం సినిమా హాల్ జంక్షన్ వద్ద అనిత ఐ క్లినిక్ డాక్టర్ గోపి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ పరవాడ మండల ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ జడ్పిటిసి,ఎంపీపీ పైల జగన్నాధ రావు విచ్చేసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపి డాక్టర్ జాక్సన్ సుమారు 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 50 మందిని శుక్లాల ఆపరేషన్ కొరకు శంకర ఫౌండేషన్ హాస్పిటల్ కు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి బుగిడి గోవింద్ , మండల పార్టీ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాస్ కాసులు, పరవాడ గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు, పెద్ద చెరువు అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, డి .ఎం. ఎల్ నాయుడు, బొద్దపు అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టిలో వ్యక్తి హత్య

మహేశ్వరం జూన్ 10 (సూర్య వాస్తవం) : మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పరిధిలోని ఓ ఇట్టుక బట్టి లో ఓ వ్యక్తిని హత్య చేశారు.స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిషా రాష్ట్రానికి చెందిన తులరాం వయసు( 45) గా గుర్తించారు. సంఘటన స్థలానికి మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ రవిందర్ చేరుకొని ఘటన స్థలాని డాగ్ స్క్వాడ్ తో పరిశీలించారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లోకేష్ ని కలిసిన వేణుతుర్ల రవిశంకర్ రెడ్డి..



కడప, సూర్య వాస్తవం: ఉండవల్లి లో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ని సోమవారం ఆర్ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు వేణుతుర్ల రవిశంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్య వ్యవస్థను సర్వ నాశనం చేశారని గత ఐదు సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ పరిపాలన లో అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయని తెలిపారు. ఉన్నత విద్యలో రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ పాత విధానంలో కొనసాగించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. పీజీ విద్యార్థులకు రియంబర్స్మెంట్ కొనసాగించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలని గత ప్రభుత్వంలో రాజకీయ జోక్యంతో యూనివర్సిటీలు సర్వనాశనమైపోయినయన్నీ ఈ ప్రభుత్వంలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరుగుతే తప్ప అక్కడ చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి వీలుకాదని తెలిపారు..

## వైయస్ జగన్ రెడ్డిని కలిసిన వైసీపీ నేత శంకర్ రెడ్డి

దువ్వూరు, సూర్య వాస్తవం:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని దువ్వూరు మండల వైసీపీ నాయకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి కలిశారు . సోమవారం విజయవాడలోని వైయస్ జగన్మోహన్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ నందు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కలిసారు.ఈ సందర్భంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల గురించి జిల్లాలో ప్రస్తుత పరిస్థితుల పై జగన్ మోహన్ రెడ్డి అడిగినట్లు ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి తెలిపారు. ఎవరు అధైర్య పడవద్దు త్వరలో అంతా సర్దుకుంటుందని ఆయన సూచించినట్లు తెలిపారు.



## అంబటికి టీడీపీ సెగ

గుంటూరు జూన్ 10 (సూర్య వాస్తవం) : అంబటి రాంబాబుకు టీడీపీ నుంచి ఆందోళన సెగ తగిలింది. గుంటూరులోని ఆయన నివాసం వద్దకు చేరుకున్న తెలుగు యువత ఆందోళన చేపట్టింది. ఆయన ఇంటివైపు దూసుకెళ్లే ప్రయత్నం చేసిన తెలుగు యువత కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాస్త ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. అయితే అంబటి రాంబాబు చిత్రపటానికి బొట్టు పెట్టి చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మహోత్సవానికి ఆహ్వానించారు.

## టీడీపీ, జనసేన వివాదం

పిఠాపురం జూన్ 10 (సూర్య వాస్తవం) : పిఠాపురం మరోసారి వివాదంలో నిలిచింది. నిన్న తాటిపర్తి ఆలయ బాధ్యతలపై టీడీపీ, జనసేన నేతలు బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే. తాజాగా పాదగయ సమీపంలో ఏర్పాటు చేసిన కాకినాడ ఎంపీ ఉదయ్ కుమార్, జనసేన పార్టీ ఫ్లెక్సీలను సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారు. కనీసం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయకముందే ఇలాంటి ఘటనలో చోటు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులు ఎలాంటి దారికి తీస్తాయో వేచి చూడాలి.

## మృత్యుంజయుడికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి జూన్ 10 (సూర్య వాస్తవం) : దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఆలయంలో మృత్యుంజయ స్వామికి, విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. ముందుగా పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకం చేశారు విశేషంగా భక్తులు అభిషేకంలో పాల్గొన్నారు. 45సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా' చిత్రానికి సంగీత దర్శకుడిగా కాల భైరవ.. స్పెషల్ వీడియో రిలీజ్ చేసిన టీమ్ కాల భైరవ.. భారతదేశానికి ఆస్కార్ సాధించి పెట్టిన 'నాటు నాటు ..' పాటను పాడి ఆస్కార్ వేదికను ఓ ఊపు ఊపారు. ఆయన ఓ వైపు సింగర్‌గా, మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్‌గా రాణిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ యంగ్ మ్యూజికల్ సెన్సేషన్ ఓ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఆ క్రేజీ సినిమాయే 'యుఫోరియా'. వైవిధ్యమైన సినిమాలు, భారీ చిత్రాలను తెరకెక్కించటంలో సెన్సేషనల్ డైరెక్టర్ గుణశేఖర్ డైరెక్షన్‌లో 'యుఫోరియా' అనే యూత్‌ఫుల్ సోషల్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'యుఫోరియా'కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కాలభైరవ టీమ్‌తో జాయిన్ అవుతున్నారంటూ ఓ స్పెషల్ వీడియో ద్వారా అనౌన్స్ చేసింది. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ నిర్మాతగా ఈ చిత్రం రూపొందనుంది. ఈసినిమాలో నటించబోయే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని టీమ్ తెలియజేసింది.

## శ్రీధర్ అన్న మమ్మల్ని క్షమించు... అక్కున చేర్చుకోండి

### – నెల్లూరు మేయర్ స్రవంతి



నెల్లూరు జూన్ 10 (సూర్య వాస్తవం) : వై.సి.పి.కి.రాజీనామా చేస్తున్నానని నెల్లూరు మేయర్ స్రవంతి వెల్లడడించారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా నాకు కార్పొరేటర్ టికెట్ ను శ్రీధర్ రెడ్డీ ఇచ్చారు. అంతేగాక మేయర్ ను చేశారు. మాలాంటి ఎందరో కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించారు. రాజకీయాల్లో నాకు ధైర్యాన్ని ఇచ్చారు. శ్రీధర్ రెడ్డి వై.సి.పి.ని వీడినప్పుడు కూడా ఆయసతోనే ఉంటానని స్పష్టం చేశాం. అప్పట్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వై.సీ.పి.లోకి వెళ్ళాల్సి వచ్చింది. శ్రీధర్ రెడ్డి పై విమర్శలు చేయాలని అక్కడి నాయకులు మాపై ఒత్తిడి తెచ్చారు. శ్రీధర్ రెడ్డిని ఒక మాట కూడా మాట్లాడలేదు. మా తప్పులను శ్రీధర్ రెడ్డీ మన్నించి మమ్ములను అక్కున చేర్చుకోవాలని కోరుకుంటున్నామని ఆమె అన్నారు.

## ఆనం ను కలిసిన శివశంకర్



పోరుమామిళ్ల , సూర్య వాస్తవం: నెల్లూరు జిల్లా ఆత్మకూర్ లో ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిని రాష్ట్ర దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆనం ను కలిసిన వారిలో రాష్ట్ర దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ తో పాటుగా రంగసముద్రం టీడీపీ నాయకులు చెన్నారెడ్డి, వీర పోగు బాలుడు, తిరుపతి మరియు పుల్లయ్యలు ఉన్నారు.

## ఎమ్మెల్యేని సన్మానించిన ఐటీడీపీ సభ్యులు



గుంతకల్లు ప్రతినిధి , సూర్యా వాస్తవం: అధికారంలో ఉన్న లేక పోయినా తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే ఐ డి డి పి సభ్యులు సోమవారం గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యుడు గుమ్మలూరు. జై రామ్ ని.మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నా గెలుపు కోసం నిరంతరం పనిచేసిన వారిలో మీరు ప్రత్యేక చొరవ తీసుకొని నా గెలుపుకు పనిచేశారు త్వరలో మీకు కష్టానికి ఫలితం ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శివ అభిరామ్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి మంత్రి పదవి కేటాయించాలి

### – జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళీ

ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి మంత్రి పదవి కేటాయించాలి జనసేన పార్టీ నాయకులు మాదాసు మురళీ కోరారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాయితీ, నిస్వార్థ పరుడు అయిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి మంత్రి పదవి కేటాయించాలని చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రొద్దుటూరు గత ప్రభుత్వం పాలకులు చేసిన తప్పుల వలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారు అయిందని మునిసిపల్ నిధులు దుర్వినియోగం చేసి ప్రొద్దుటూరు ను అస్తవ్యస్తం గా తయారు చేశారన్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందాలంటే నిజాయితీ పరుడు అయిన వరద రాజుల రెడ్డి గెలిపిస్తే ప్రొద్దుటూరు అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని గ్రహించి భారీ మెజారిటీ తో గెలిపించడం జరిగిందని, గెలిపించినందుకు జనసేన పార్టీ తరుపున ప్రతి ఒకరికి ధన్యవాదాలు తెలిపారు. ఆయనకి మంత్రి పదవి కేటాయిస్తే జిల్లా మొత్తం అభివృద్ధి చెందుందన్నారు. ఈ సమావేశంలో




జనసేన పార్టీ సైనికులు లక్ష్మి నారాయణ, మహామద్ గౌస్, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, టి.డి. పి బి.సి నాయకుడు వెంకట కృష్ణ యాదవ్, రవి, చిలకల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యాడ్ చైర్మన్ చిన్నప్పకు ఘనసత్కారం

### – జగన్మోహన్ రెడ్డి హయాంలో మార్కెట్ యార్డ్ అన్ని విధాల అభివృద్ధి

పులివెందుల అర్బన్, సూర్య వాస్తవం: పులివెందుల పట్టణ పరిధిలో జగన్మోహన్ రెడ్డి హయాంలో రైతుల, వ్యాపారస్తుల సంక్షేమం కోసం మార్కెట్ యార్డ్ ఎంతో అభివృద్ధి చెందడం జరిగిందని, చీని వ్యాపారస్తులు, రైతులు మార్కెట్ యాడ్ సిబ్బంది కలసి మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్పను దుష్యాల్వా గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గా విధులు నిర్వహించిన గోటూరు చిన్నప్ప ఈనెల 5వ తారీకు తన రాజీనామాను సమర్పించగా, సోమవారం చీనీ వ్యాపారస్తులు, రైతులు ,మార్కెట్ యార్డ్ సిబ్బంది చిన్నప్పను ప్రత్యేకంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా రైతులు వ్యాపారస్తులు మాట్లాడుతూ పులివెందుల లో రైతుల, వ్యాపారస్తుల కోసం జగన్మోహన్ రెడ్డి హయాంలో నూతన హంగులతో అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేసి రైతులకు వ్యాపారస్తులకు అండగా నిలవడం





జరిగిందని, అదేవిధంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ గా చిన్నప్ప పదవి హయాంలో రైతులకు వ్యాపారస్తులకు ఆదాయ మార్గాలలో అన్ని విధాల సహాయ సహకారాలు అందించి సేవలందించారని, అదేవిధంగా మార్కెట్ యార్డ్ సిబ్బంది రైతుల పట్ల వ్యాపారస్తుల పట్ల ఏటువంటి తారతమ్యం లేకుండా విధులు నిర్వహించి సహాయ సహకారాలు అందించారని, ఇదేవిధంగా రానున్న నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్ రైతులకు వ్యాపారస్తులకు అండగా నిలిచి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీనీ వ్యాపారస్తులు, రైతులు హనుమంత రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీను, రమణారెడ్డి, సాదక్, అస్వర్తరెడ్డి, మార్కెట్ సెక్రటరీ రత్నరాజు, సూపర్వైజర్ రామకృష్ణ, మరియు మార్కెట్ యార్డ్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో గెలుపు, ఓటములు సహజం

* అధికారం ఉండక పోవడం, లేక పోవడం జరుగుతువుంటాయి.
* అధికారంలోకి వచ్చిన వారు అభివృద్ధి చేయాలి
* మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

అన్నమయ్య, సూర్య వాస్తవం: రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణలు చూస్తుంటే చాలా బాధ అనిపిస్తుంది. దాడులు జరుగుతుంటే పోలీసులు మాకు ఎందుకులే అని వ్యవహరించడం సరైన పద్ధతి కాదు. అక్రమ కేసులు పెట్టి వేధిస్తుండడం బాధాకరం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సువర్ణావకాశం బిజెపి కి మెజార్టీ రాకపోవడం బిజెపి పార్టీకి 240 సీట్లు మాత్రమే రావడం 32 సీట్లు భాగస్వాములపైన ఆధారపడడం ఒక వరం. దీన్ని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపైన ఉంది క్యాబినెట్ లో పదవుల కోసం మద్దతు తెలుపడం సమంజసం కాదు పోలవరం కు 12 వేల కోట్ల రూపాయలు రావాల్సివుంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్రాన్ని పట్టు పట్టడంతో ఒకకొలిక్కు వచ్చింది. కేవలం ఒక్క సిగ్నేచర్ తో కేంద్రం నుంచి పోలవరానికి 12 వేల కోట్ల రూపాయల నిధులు విడుదల అవుతాయి. రాజధాని నిర్మాణం ప్రాధాన్యత పెట్టుకున్న భాద లేదు... పెట్టుకోవాలి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు తెచ్చుకోండి ప్రత్యేక హోదా అనేది చాలా అవసరం తెలుగుదేశం సపోర్టుతో బిజెపి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రత్యేక హోదా ఇస్తేనే మేము మద్దతు ఇస్తామని గట్టిగా అడిగితేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చే అవకాశం ఉంది ప్రత్యేక హోదా వస్తే ఉద్యోగాలు చాలా మెరుగుపడతాయి. రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు వచ్చి యువతకు మంచి జరుగుతుంది.చంద్రబాబు నాయుడు ఆందోళనలకు, బెదిరింపులకు గురికాకుండా ప్రత్యేక హోదా అడగాలి అన్నారు.ప్రత్యేక హోదా కోసం వైసీపీ కు సంబధించిన 11 రాజ్యసభ ఎంపీలతో పాటు 4 పార్లమెంట్ ఎంపిలు గట్టిగా, అండగా నిలబడతాం.ప్రత్యేక హోదా మిస్ అయితే మరి ఎప్పటికీ అవకాశం రాదు కాబట్టి రాష్ట్రానికి మేలు జరుగుతుందంటే వైఎస్ఆర్సిపి ఎప్పుడు ముందుంటుంది ప్రత్యేక హోదా అనేది మన హక్కు, మిస్ చేసుకోవద్దు అని తిలిపారు. ప్రజాస్వామ్యంలో ఎక్కడా కూడా హింసకు, అరాచకాలకు తావు ఉండకూడదు అని ఎన్నికల కోడ్ సందర్భంగా ఎన్నడూ లేని విధంగా వైఎస్ఆర్సిపి చేసిన అభివృద్ధి భవనాల బోర్డులను ముసుగులు వేశారు ముసుగులు ఎందుకు వేశారు అని ప్రశ్నించలేదు, బాధపడలేదు. గ్రామాలలో బోర్డులను ధ్వంసం చేసే సంస్కృతి రాయచోటి లో లేదు కొత్తగా ఐదు సంవత్సరాలు అవకాశం ఉంది అభివృద్ధి చేయండి. బోర్డులు పగలగొట్టడం ఏంటి, పచ్చరంగు వేయండం ఏంది అంటూ మండి పడ్డారు. శిబ్యాల గ్రామంలో అభివృద్ధి నోచుకున్న శిలాఫలకాలను ధ్వంసం చేయడం సమజసం



కాదు జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి అన్నారు. శిలాఫలకాలు పగలగొట్టడం రంగులు పూయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదు అని వివరించారు.మ్యాండేట్ ఎప్పుడు ఎవరికి ఒకే సైడ్ ఉండదు. ప్రజాభిప్రాయం గౌరవించడం నేర్చుకోవాలి. 60 సంవత్సరాల నుంచి రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం నుంచి పుట్టిన వాడిని ప్రతిపక్షం లో అనేక కష్టాలు ఎదుర్కొన్నాను ఇది ఏమి కొత్త కాదు. ధైర్యంగా ఎదుర్కునే ధైర్యాన్ని దేవుడు నాకు ఇచ్చాడు అని పేర్కొన్నారు. ఈ ఐదు సంవత్సరాలు కష్టపడి ప్రజలకు అండగా ఉంటానని ప్రతి కార్యకర్తలు తోడుగా ఉంటా నన్నారు. ఫోన్లు చేసి బెదిరించి, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురి చేయడం సరైన పద్ధతి కాదు. వ్యవస్థను కాపాడుకోనే విధంగా ఐదు సంవత్సరాలు పోలీసులకు ఎలాంటి గౌరవం ఇచ్చానో మీ గుండెలపైన చెయ్ వేసుకోండి పోలీస్ అధికారులు పోలీసులు ఎంత స్వచ్ఛగా బ్రతికారో ఆలోచించుకోండి అన్నారు. నిర్ధర్శనంగా కార్యకర్తలను హింసిస్తామంటే ఊరికే ఉండేది లేదు, మేము ఎవరి పైన కూడా పోరాటాలు చేస్తాం అని ఏ కార్యకర్తకు చిన్న గాయమైన సహించము జిల్లా ఎస్పీకి కలిసి ఫిర్యాదు చేస్తాం అన్నారు.

## నారా లోకేష్ బాబు ని కలిసిన రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు

వీరబల్లి, సూర్య వాస్తవం: సోమవారం రోజు విజయవాడలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే కాబోయే మంత్రివర్యులు నారా లోకేష్ బాబు ని రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన లోకేష్ బాబు కి ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలియజేశారు.



# కడప నగరంలోని 31వ డివిజన్‌లో విజయోత్సవ సంబరాలు



కడప ప్రత్యేక ప్రతినిధి, సూర్య వాస్తవం: కడప నగరంలోని 31వ డివిజన్ ఇంచార్జ్ సయ్యద్ నాయబ్ ఆధ్వర్యంలో రెడ్డప్పగారి మాధవి రెడ్డి విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జియాఉథీన్ హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కడపలో 30 ఏళ్ల చరిత్రను తిరగరాసి టీడీపీ అభ్యర్థిగా అఖండ మెజారిటీతో గెలుపొందిన రెడ్డప్పగారి మాధవి రెడ్డి గారి గెలుపు కడప అభివృద్ధికి మలుపు అన్నారు. ఈ విజయోత్సవ సంబరాల కార్యక్రమంలో భాగంగా 31 డివిజన్ ఇంచార్జ నాయబ్ ముఖ్య అతిథులకు మరియు బూత్ ఇంచార్జ్ లు, బూత్ ఏజెంట్లుకు ఘనంగా శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో 29 డివిజన్ ఇంచార్జ్ మరియు కడప నగర ఉపఅధ్యక్షులు షేక్ మొహమ్మద్ షా, 39వ డివిజన్ ఇంచార్జీ ఆరీఫుల్లా, 31 డివిజన్ బూత్ ఇంచార్జ్ మయాన ఇస్మాయిల్ ఖాన్, జమీల్ అహ్మద్, ఆన్సర్ భాష, జిలాన్, శ్రీనాథ్, బాబ్జి, వీళ్ళతోపాటు బూత్ ఏజెంట్లు సమీర్, షాకీర్, అల్లాహ్ బకష్, ఖాదర్ బాషా, మహబూబ్ బాషా, జమురుత్, రఫీ, గణేష్, సుధాకర్, రమేష్, సర్తాజ్, బబ్లూ, సదక్ చిన్నా, గౌస్ అహ్మద్ ఖాన్, గయాజ్ ఉద్దీన్, అమీర్, ఇషాక్, యూనస్ డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్ కు పేరు మార్చాలి

## -మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల



పులివెందుల రురల్, సూర్య వాస్తవం: పులివెందుల పట్టణంలోని కూరగాయల మార్కెట్ కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని పేరు మార్చాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాసంలో పత్రిక సమాచారాన్ని తెలియజేస్తూ గతంలో హిందూ సంఘ నాయకులు కూరగాయల మార్కెట్ కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని పేరు మార్చాలని ధర్నాలు నిర్వహించితే హిందూ సంఘ నాయకుల మాటలు లెక్కచేయకుండా కూరగాయల మార్కెట్ కు వైయస్సార్ కూరగాయల మార్కెట్ అని పెట్టడం చాలా దారుణం అన్నారు. అప్పటిలో హిందూ సంఘ నాయకులకు తెలుగుదేశం పార్టీ మద్దతు పలికి మా ప్రభుత్వం వస్తానే వెంటనే పేరును మార్పించడం జరుగుతుందని వారికి కూడా మాట ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు పాలకమండలి సభ్యులు స్పందించి పది రోజుల్లో లోపల కూరగాయల మార్కెట్ కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని పేరు మార్చాలని లేకుంటే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పది రోజుల తర్వాత మేమే పేరును మార్పించేందుకు చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# గర్భవతులు మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలి

దువ్వూరు,సూర్య వాస్తవం: స్త్రీలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతిరోజు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ హేమలత, డాక్టర్ వికసిత, డాక్టర్ షేక్ రోషిణి లు పేర్కొన్నారు. సోమవారం దువ్వూరుప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ కె సురేష్ బాబు,డాక్టర్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాలలో ప్రమాద స్థాయి గర్భవతులను గుర్తించి ప్రసవ సమయంలో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేటట్టు చేసి సుఖ ప్రసవం జరిగేటట్టు చేయాలన్నారు. తరవాత ఆసుపత్రిలోని టీకాల గది, కాన్పుల గది, సూదులు వేసే గది, వాక్సిన్ నిల్వ





చేసే గది నీ పరిశీలించి కొన్ని సలహాలు ఇచ్చారు. గర్భవతులు ప్రతి నెల క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ హేమలత ,డాక్టర్ వికసిత, డాక్టర్ రోషిణి లుతెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా 73 మంది గర్భవతులు హాజరు కావడం జరిగింది,వీరందరికీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం సూపర్వైజర్ మేరీసువర్ణ,పి హెచ్ యన్ పి.శాంతకుమారి, సచివాలయ సిహెచ్ ఓలు హరిచందన, హరిప్రియ, సౌభాగ్య లక్ష్మి, పూజ,ఈలవర్సి,ఏయన్ యం లు, ఆశా కార్యకర్తలు,హాస్పిటల్ సిబ్బంది, గర్భవతులు పాల్గొన్నారు.

# కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మకి శుభాకాంక్షలు

## - పోతుగుంటరమేష్ నాయుడు



రాజంపేట టౌన్, సూర్య వాస్తవం: బిజెపిలో సామాన్య కార్యకర్తకు దక్కిన గౌరవం నేడు ఢిల్లీలో కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణం చేసిన భూపతి రాజు శ్రీనివాస వర్మ కి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇన్చార్జి పోతుగుంట రమేష్ నాయుడు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ఆంధ్రప్రదేశ్లో ప్రతి కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం ఎందుకంటే శ్రీనివాస వర్మ గారు బిజెపిలో ఒక సామాన్య కార్యకర్తగా ఉన్నటువంటి వ్యక్తి ఏ బాధ్యత ఇచ్చిన క్రమశిక్షణతో పట్టుదలతో పని చేస్తున్న వ్యక్తి కావున వారికి పార్టీ గెలిచి టికెట్ ఇచ్చి ఎంపీగా గెలిచిన తర్వాత వారికి కేంద్ర సహాయ మంత్రిగా ఇవ్వడం ఇది ఆంధ్రప్రదేశ్ లో ఉన్న బిజెపి కార్యకర్తలు అందరి కి దక్కిన గౌరవంగా భావిస్తున్నాము భారతీయ జనతా పార్టీలో క్రమశిక్షణతో నిజాయితీతో నిబద్ధతతో పనిచేస్తే పార్టీ ఎప్పటికైనా ప్రతి ఒక్కరిని గుర్తిస్తుందని గతంలో అనేక ఉదాహరణ మనం చూసాం ఇప్పుడు కూడా శ్రీనివాస్ వర్మకు దక్షిణ గౌరవం ఇది కార్యకర్తలు అందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నాం రాబోవు రోజుల్లో కూడా రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు మరింత బలప బలపడుటకు సహాయ సహకారాలు అందించుటకు వీరు పాత్ర ఎంతో ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు

# రాముడి గెలుపు రాయచోటికే మలుపు : రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్



అన్నమయ్య, సూర్య వాస్తవం: స్థానిక ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ మాట్లాడుతూ రాయచోటిలో రాముడి గెలుపు రాయచోటి కే మలుపు అని రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ అన్నారు . రాయచోటిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం- బిజెపి- జనసేన కూటమి గెలుపునకు కృషిచేసిన అన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజకవర్గం గిరిజన ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ రాజంపేట పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఎమ్మెల్యేలందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి అమాస రెడ్డెయ్య మాట్లాడుతూ రాష్ట్ర కూటమి అన్నమయ్య జిల్లా పరిధిలో వున్న గిరిజన ప్రజానీకానికి, పార్టీకి అహర్నిశలు కష్టపడిన పార్టీ కార్యకర్తలకు, నాయకులుకు మరియు పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులకు, అదేవిధంగా రాయచోటి స్థానిక ఎమ్మెల్యే మండలిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలో ప్రతి గిరిజన సోదరులకు అన్నివిధాలుగా అందుబాటులో వుండి ప్రవేశపెట్టబోవు పథకాలన్నింటినీ కూడా గిరిజన సోదరులకు అందేవిధంగా నావంతు సహాయ సహకారాలు అందిస్తానని మరియు రాష్ట్రంలో మరియు పార్లమెంట్ పరిధిలో అన్నివిధాలుగా గిరిజనులందరూ 80% ఓటింగ్ కూటమి వైపు మొగ్గుచూపారు అని తెలియజేయడం జరిగింది. టిడిపి ఎస్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి బి. మీటు నాయక్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో గిరిజన సోదరులు వైసిపి ప్రభుత్వం జరిపిన అరాచకాలకు మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి రాజంపేట నియోజకవర్గం రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు కిషోర్ నాయక్, జయరాం నాయక్, నిత్య పూజయ్య, పి. రాము, ఎస్.సునీల్, ఎం. బద్దు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఆశా వర్కర్ల ధర్నా

కాకినాడ జూన్ 10 (సూర్య వాస్తవం) : నల్లజర్ల మండలం పోతవరం లో పీహెచ్ సి కేంద్రం వద్ద ఆశ వర్కర్ల ధర్నా ఏడవ రోజు కొనసాగింది. స్థానిక ఏఎన్ఎం దుర్గాదేవి ఆశ వర్కర్లను వేధింపులు గురి చేస్తున్నారంటూ ఆశ వర్కర్ల ఆరోపణ. ఏఎన్ఎం దుర్గాదేవి పై చర్యలు తీసుకోకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## పోలీస్ కమిషనరేట్ సీపీ టాస్క్ ఫోర్స్ వరుస దాడులు



బీమరం జూన్ 10 (సూర్య వాస్తవం) : నమ్మదగిన సమాచారం మేరకు సీపీ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సంజయ్ , ఎస్సై ఉపేందర్, భీమారం ఎస్ ఐ రాములు , భీమారం వ్యవసాయ అధికారి మార్క్ గ్లాడ్ స్టన్ మరియు టాస్క్ ఫోర్స్ సిబ్బంది లతో కలిసి ఈరోజు ఉదయం మంచిర్యాల జిల్లా లోని బీమారం పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఆవడం లీ రోడ్ వద్ద ఒక వ్యక్తి మూడు సంచులతో ఆటో కోసం ఎదురుచూస్తూ అనుమానాస్పదంగా కనిపించగా, అతనిని పట్టుకొని సంచులు తనిఖీ చేయగా ఒక క్వింటాలు ఏడు (107 ఎణబ) కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. విచారణ చేయగా అతని పేరు చుండు నాగేశ్వరరావు అని, భీమారంలో కౌలుకు వ్యవసాయం చేస్తానని, గుంటూరు జిల్లాకు చెందిన తాను, కర్నూలులో గుర్తుతెలియని వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేసి మంచిర్యాల ప్రాంతంలోని అమాయకపు రైతులకు ఎక్కువ ధరకు అమ్ముట కొరకై తీసుకువచ్చానని, ఆర్టీసీ బస్సు దిగి ఆటో కోసం ఇక్కడ ఉన్నానని తెలపడం జరిగింది.

## బైరాన్ పల్లిలో బయటపడ్డ చాళుక్యుల నాటి శిల



సిద్దిపేట జూన్ 10 (సూర్య వాస్తవం) ;సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలంలోని భైరాన్ వల్లిలో పురాతన శిల బయటపడింది. గ్రామంలోని పురాతన జైన ఆలయం ఆవరణలో గ్రామస్థులు ఈ శిలను గుర్తించారు. స్థానికంగా అంగడి వీరన్న శివాలయంగా పిలిచే ఈ ఆలయం ఆవరణలో ఇటీవలి వర్షాలకు చిన్న గుంత ఏర్పడింది. అందులో ఈ శిలను గుర్తించి బయటకు తీసినట్లు గ్రామస్థులు తెలిపారు. దీనిపై పురావస్తు శాఖకు సమాచారం ఇవ్వగా.. గ్రామానికి చేరుకున్న అధికారులు ఆ శిలను పరిశీలించి అది చాళుక్యుల కాలం నాటిదని వెల్లడించారు.పురావస్తు శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ తాజాగా బయటపడ్డ ఈ శిల జైన చౌముఖి శిల్పం అని, 5 అడుగుల ఎత్తుతో చెక్కారని చెప్పారు. నలువైపులా ఉన్న శిల్పాలు 24వ జైన తీర్థంకరుడు మహావీరుడి ధ్యానం చేస్తున్న చిత్రాలని వివరించారు. గతంలో ఈ తరహా శిల్పాలను కొలనుపాక, వేములవాడలో గుర్తించామని చెప్పారు. జైనులు వీటిని 'సర్వతోభద్ర' అంటూ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ శిల్పాలు లభించిన ప్రాంతాలు గతంలో జైనధర్మ కేంద్రాలుగా విరాజిల్లాయని వివరించారు. బౌద్ధుల తరహాలోనే జైనులు కూడా స్తూపాలు, చైత్యాలు నిర్మించుకునేవారని, గ్రామంలోని అంగడి వీరన్న శివాలయం ముందున్న శాసనాల ద్వారా తెలుస్తోందని శ్రీనివాస్ చెప్పారు.

## రెడ్ క్రాస్ ఆద్వర్యం లో ఉచిత ఎంఎంయు వైద్య శిబిరం




హైదరాబాద్ జూన్ 10 (సూర్య వాస్తవం) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ వారి అద్వర్యం లో పాత నగరం లోని ఫలక్ నుమా స్టేషన్ రోడ్ లో ఫాతిమా వృద్ధాశ్రమం నందు 60 సంవత్సరాలు పైబడిన వారికి ఆరోగ్య పరీక్ష నిర్వహించి మందు పంపిని చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మొబైల్ మెడికల్ యూనిట్ ద్వార హైదరాబాద్ రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీ మామిడి భీమ్ రెడ్డి గారి అద్వర్యం లో , హైదరాబాద్ డివిజన్ కన్వీనర్ కోటి ధర్మ తేజ, ఎమ్ సీ సభ్యుడు రియాజుద్దీన్ ద్వార ఏర్పటు చెయ్యడం జరిగింది. దాదాపు 60 మంది వరకు రోగులకి డాక్టర్ శ్రీజ రెడ్డి, డాక్టర్ అదీబ్ . సుజాత విజయలక్ష్మి మరియు ఎ ఇ సభ్యులు వీరమణి, శివరాణి రాకేష్, అబ్దుల్ మజీద్ , శివరాణి , రాకేష్ , సందీప్ మరియూ సత్యనారాయణ, మహమ్మద్ అబ్దుల్ వాసిఫ్ లు పాల్గొన్నారు.

## ఆలూరు ఎమ్మెల్యే బుసినె వీరుపాక్షి ని మర్యాదపూర్వకంగా కలిసిన తెర్నేకల్ వైస్సార్ సిపి నాయకులు

దేవనకొండ జూన్ 10 (సూర్య వాస్తవం) : ఆలూరు నియోజకవర్గం శాసనసభ్యులు గా గెలిచిన వీరుపాక్షి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన తెర్నేకల్ గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్ కుమార్, వైసిపి జిల్లా కోశాధికారి కొత్త కాపు మధు సుధన్ రెడ్డి, ఎంపిటిసి నామల శ్రీను, బెల్ ఈరన్న మాజీ యంపిటిసి చాప ఈరన్న, తరువాత యంయల్ఏ వీరుపాక్షి గారూ మాట్లాడుతు నా విజియానికి 1907 మెజారిటికి కృషి చేసిన తెర్నేకల్ సర్పంచ్ అరుణ్ , సురేంద్ర రెడ్డి, మధుసూదన్ రెడ్డి శ్రీను, ఈరన్న లు మరియు గ్రామ ప్రజలు కు అభినందనలు తెలిపారు.

# సినిమా

## ఈ ముద్దుల పాపను గుర్తు పట్టారా? టాలీవుడ్ హీరో కూతురు..


ఫొటోలో క్యూట్‌గా కనిపిస్తోన్న ఈ క్యూట్ పాపను గుర్తు పట్టారా? ఈ బుజ్జాయి ఒక స్టార్ హీరో కూతురు. ఇప్పుడు ఏకంగా హీరోయిన్ గా కూడా మారిపోయింది. అందరిలా కాకుండా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. సినిమా ఇండస్ట్రీలో పురుషాధిపత్యం ఎక్కువగా ఉంటుందనే మాట ఉంది.



అందుకు తగ్గట్టుగానే స్టార్ హీరోల కుమారులు వారుసులుగా సినిమా పరిశ్రమలోకి అడుగుపెడతారు. అదే సమయంలో హీరోల కూతుళ్లు మాత్రం ఈ ఎంటర్‌టైన్మెంట్ రంగంలోకి అరుదుగా అడుగుపెడతారు. ఈ కోవకు చెందుతుంది పైన ఉన్న హీరోయిన్. చేసింది తక్కువ సినిమాలే అయినా మంచి గుర్తింపు తెచ్చుకుందామె. స్కిన్ షోకు దూరంగా ఉంటూ కేవలం కథా ప్రాధాన్యమున్న చిత్రాల్లోనే నటించింది. మరి ఈ ముద్దుల పాప ఎవరో గుర్తు పట్టరా? తను మరెవరో కాదు టాలీవుడ్ యంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్– జీవిత దంపతుల చిన్న కూతురు, అదే నండి మన దొరసాని శివాత్మిక రాజశేఖర్. ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన తర్వాత తల్లిదండ్రుల అడుగు జాడల్లోనే నడుద్దామనుకుంది శివాత్మిక. అందుకే హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. ఆనంద్ దేవర కొండ హీరోగా నటించిన దొరసాని చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. మొదటి చిత్రంతోనే అందం, అభినయం పరంగా మంచి మార్కులు తెచ్చుకుంది. ఈ సినిమాలో శివాత్మిక అభినయానికి గుర్తింపుగా సైమా పురస్కారం కూడా అందుకుంది. ఆ తర్వాత పంచతంత్రం, రంగమార్తాండ సినిమాల్లోనూ నటనకు ప్రాధాన్యమున్న పాత్రలే చేసింది. అలాగే తమిళంలో రెండు చిత్రాల్లో నటించింది. అయితే ఈ అమ్మడి తర్వాతి సినిమాల గురించి ఇంకా అప్ డేట్స్ రావాల్సి ఉంది. ఇక సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మకు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె షేర్ చేసే ఫొటోస్, వీడియోలకు ఫాలోవర్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది.

## బాలీవుడ్ లోకి రానా.. మనసులో మాట చెప్పేసిన రకుల్

విశ్వక్సేన్ హీరోగా నటించిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. నెట్‌ఫ్లిక్స్ లో ఈనెల 14 నుంచి స్ట్రీమింగ్ కానుంది. చరిత్రలో నిలిచిపోవడానికి లంకల రత్నం వస్తున్నాడు అంటూ ప్రకటించారు. లంకల రత్నాకర్‌గా విశ్వక్‌సేన్, రత్నమాలగా అంజలి, బుజ్జి పాత్రలో నేహాశెట్టి మెప్పించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. ఆడిషన్‌ని అమ్మకి డెడికేట్ చేశాడు.



మరి జడ్జెస్‌ని ఇంప్రెస్ చేసి గోల్డెన్ టిక్కెట్ గెలుస్తాడా? మీరు ఏం అనుకుంటున్నారు? అంటూ తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ త్రీ స్కంద ఆడిషన్ ప్రోమోని విడుదల చేశారు. అచ్చ తెలుగు ఓటీటీ ఆహాలో ప్రసారం కానుంది తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ త్రీ. జూన్ 14 నుంచి ప్రతి శుక్ర, శనివారాల్లో రాత్రి ఏడు గంటలకు ప్రసారం కానుంది.దర్శకుడు శ్రీను వైట్ల ప్రస్తుతం మంచి కమ్ బ్యాక్ కోసం చూస్తున్నారు. తాజాగా ఈయన తెరకెక్కిస్తున్న సినిమా విశ్వం. గోపీచంద్ ఇందులో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు తన వింటేజ్ కామెడీ కూడా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు వైట్ల. అందులో భాగంగానే వెంకీ తరహాలోనే ఓ ట్రైన్ సీక్వెన్స్ డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తుంది.: రానా త్వరలోనే ఓ బాలీవుడ్ సినిమాలో నటించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ డైరెక్టర్ అమిత్ రాయ్ త్వరలో తెరకెక్కించబోయే ఈ పీరియాడిక్ సినిమాలో రానా కూడా నటించనున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో షాహిద్ కపూర్ శివాజీ పాత్రలో నటిస్తుండగా, రానా ఔరంగజేబ్ పాత్రలో నటిస్తారని ప్రచారం జరుగుతుంది. ఇండియన్ 2 సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రకుల్ ప్రీత్ సింగ్. ఇందులో హీరో సిద్ధార్థ్‌కు జోడీగా నటిస్తున్నారీమె. తాజాగా ఇండియన్ 2 సినిమాలో తన పాత్ర గురించి చెప్పుకొచ్చారు రకుల్. ఈ సినిమాలో తన కారెక్టర్‌ను శంకర్ తీర్చిదిద్దిన తీరు అద్భుతం అని.. ఎవరికీ తలొంచని అమ్మాయిగా ఇందులో నటిస్తున్నట్లు తెలిపారు రకుల్. తన నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రనే ఇందులో చేస్తున్నట్లు తెలిపారు ఈ బ్యూటీ.

## స్టార్ హీరో కొడుకుతో రొమాన్స్‌కు రెడీ అయిన శ్రీలీల..



టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీగా మంచి పేరు తెచ్చుకుంది అందాల భామ శ్రీలీల . తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకొని కుర్రాళ్ళ ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ ముద్దుగుమ్మ. దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది. ఆతర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా మారిపోయింది. పెళ్లి సందడి సినిమా తర్వాత ధమాకా సినిమాతో హిట్ అందుకుంది శ్రీలీల. ఆతర్వాత వరుసగా యంగ్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. కానీ ఆ సినిమాలు అంతగా సక్సెస్ కాలేదు. సూపర్ స్టార్ మహేష్ బాబుకు జోడీగా గుంటూరు కారం సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా యావరేజ్ గా నిలిచింది. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కు జోడీగా ఉస్తాద్ భగత్ సింగ్ అనే సినిమాలో నటిస్తుంది. ఇక ఈ అమ్మడు ఇప్పుడు బాలీవుడ్ కు చెక్కేయనుంది. బాలీవుడ్ లో సినిమా చేసేందుకు శ్రీలీల రెడీ అయ్యిందని టాక్ వినిపిస్తుంది. స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ తనయుడు హీరోగా పరిచయం కానున్న సినిమాతోనే శ్రీలీల కూడా బాలీవుడ్ కు పరిచయం కానుందని టాక్ వినిపిస్తుంది.

# ఆరోగ్యం

## ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు వేసుకుని తాగితే ఏమవుతుందో తెలుసా..?

ఇలా తాగడం వల్ల మొటిమలు, సోరియాసిస్, తామర లక్షణాలు తగ్గుతాయి. గోరువెచ్చని నీటిలో ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరంలోని విషపదార్థాలు విడుదలవు తాయి. తద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. అంతేకాకుండా, ఉప్పు నీరు మూత్రపిండాలు, కాలేయాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక వ్యాధుల నుండి



శరీరాన్ని రక్షించడానికి మీరు రోజూ ఉప్పునీరు తాగవచ్చు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి, బాడీలో టాక్సిన్స్‌ను బయటకు పంపడానికి ప్రతిరోజూ తగినంత నీరు తాగడం మంచిది. దీని వల్ల శరీరంలోని మురికి కూడా సులువుగా బయటకు వస్తుంది. అలాగే, ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటిని తాగడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. ఉదయాన్నే తాగే గోరువెచ్చని నీటిలో చిటికెడు ఉప్పు కలిపితే ఎన్ని లాభాలో తెలిస్తే ఆశ్చర్యపోతారు. పరగడుపునే గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి తాగటం వల్ల అనేక వ్యాధులకు దివ్యౌషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. గోరువెచ్చని నీటిని ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు లభిస్తాయి. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. ఈ నీటిలో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలు లభిస్తాయి. ఇది శరీరంలో సరైన ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌ను నిర్వహించడానికి సహాయపడుతుంది. కీళ్ల నొప్పులతో బాధపడేవారికి ఉప్పునీరు చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇందులో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నిత్యం నీటిలో ఉప్పు కలిపి తాగితే కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. మీకు మలబద్ధకం సమస్య ఉంటే, ఉప్పు నీరు ఔషధంగా పని చేస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగు కదలికలు సులభతరం అవుతాయి. ఇది మీ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది కడుపు స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. గోరువెచ్చటి నీటిలో ఉప్పు కలిపిన నీరు చర్మానికి చాలా మేలు చేస్తుంది. ఉప్పునీరు తాగడం ద్వారా మీరు అనేక చర్మ సంబంధిత సమస్యలను కూడా నివారించవచ్చు.

## పసుపు ఇలా వాడారంటే తలలో చుండ్రు ఇట్టే మాయం!

భారతీయుల వంట గదుల్లో పసుపు తప్పనిసరిగా ఉంటుంది. ఇది లేకుండా వంట పూర్తి కాదంటే అతిశయోక్తి కాదు. ఆరోగ్యంలోనే కాదు అందంలో పసుపుకు డిమాండ్ ఎక్కువే. మొటిమల నుండి టాన్ వరకు,



పసుపు వేలాది చర్మ సమస్యలను తొలగించడంలో సహాయ పడుతుంది. అయితే మీరు ఎప్పుడైనా జుట్టు సంరక్షణలో పసుపు వినియోగించారా? జుట్టు రాలడం, చుండ్రు, జుట్టు పెరుగుదలలో పసుపు ప్రత్యేక పాత్ర పోషిస్తుందని.. భారతీయుల వంట గదుల్లో పసుపు తప్పనిసరిగా ఉంటుంది. ఇది లేకుండా వంట పూర్తి కాదంటే అతిశయోక్తి కాదు. ఆరోగ్యంలోనే కాదు అందంలో పసుపుకు డిమాండ్ ఎక్కువే. మొటిమల నుండి టాన్ వరకు, పసుపు వేలాది చర్మ సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. అయితే మీరు ఎప్పుడైనా జుట్టు సంరక్షణలో పసుపు వినియోగించారా? జుట్టు రాలడం, చుండ్రు, జుట్టు పెరుగుదలలో పసుపు ప్రత్యేక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పసుపులో అనేక జుట్టు సంబంధిత సమస్యలకు పరిష్కరిస్తుంది. పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది జుట్టు రాలడం, తల దురద, చుండ్రు సమస్యను తగ్గిస్తుంది. పసుపులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుంచి హెయిర్ ఫోలికల్స్ ను రక్షిస్తాయి. పసుపు తలపై యాంటీ ఫంగల్ పదార్థంగా పనిచేస్తుంది. ఇది ఫంగస్‌తో పోరాడి, చుండ్రును నివారిస్తుంది. పసుపు జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందించడం ద్వారా బలమైన జుట్టును అందిస్తుంది. అయితే జుట్టు సంరక్షణలో పసుపును ఎలా వినియోగించాలంటే..రోజువారీ షాంపూలో 1 టీస్పూన్ పసుపు పొడిని కలుపుకోవాలి. దీనిని స్కాల్ప్ శుభ్రం చేయడానికి ఉపయోగించాలి. ఇది చుండ్రు నివారణతోపాటు జుట్టు వేగంగా పెరిగేలా చేస్తుంది. అలాగే 1/4 కప్పు కొబ్బరి నూనెలో 1 టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. షాంపూ చేయడానికి 30 నిమిషాల ముందు ఈ నూనెను తలకు, జుట్టుకు పట్టించి మసాజ్ చేసుకోవాలి. ఇది జుట్టును మృదువుగా మార్చడంలో సహాయపడుతుంది.

## మొటిమలకు, ఒత్తిడికి మధ్య సంబంధం ఏంటి.?

ఒత్తిడికి గురైన సమయంలో జీవన విధానంలో మార్ప వస్తుంది. ఆహారం సరిగా తీసుకోలేరు, నిద్ర సరిగ్గా ఉండదు, దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. దీని కారణంగా, చర్మంపై



మొటిమలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా భుజాలతో పాటు, నడుముపై కూడా మొటిమలు కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు. మారుతోన్న కాలంతో పాటు జీవన విధానంలో మార్పులు వస్తున్నాయి. ఒత్తిడితో కూడున్న జీవన విధానంతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. విపరీతైమన ఒత్తిడితో శారీరక సమస్యలు కూడా వస్తున్నాయి. అయితే ఒత్తిడితో మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుందని మనకు తెలిసిందే. అయితే ఒత్తిడి వల్ల ముఖంపై మొటిమలు, కళ్ల కింద నల్లటి వలయాలు కూడా వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఒత్తిడికి గురైన సమయంలో జీవన విధానంలో మార్ప వస్తుంది. ఆహారం సరిగా తీసుకోలేరు, నిద్ర సరిగ్గా ఉండదు, దీంతో జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి. దీని కారణంగా, చర్మంపై మొటిమలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా భుజాలతో పాటు, నడుముపై కూడా మొటిమలు కనిపిస్తాయని నిపుణులు అంటున్నారు.

# క్రీడలు

## మా జట్టు ఓడిపోవడానికి ప్రధాన కారణం అతడే: పాక్ మాజీ కెప్టెన్

టీ20 ప్రపంచ కప్‌లో వరుసగా రెండో ఓటమితో పాకిస్థాన్ కష్టాల్లో పడింది. భారత్ నిర్దేశించిన 120 పరుగుల టార్గెట్‌ను ఛేదించడంలో విఫలమైన పాక్ 113/7 స్కోరుకే పరిమితమైంది. అయితే, తమ జట్టు ఓటమికి భారత అద్భుతమైన బౌలింగ్‌తోపాటు పాక్ బ్యాటర్ల తప్పిదాలే కారణమని మాజీ కెప్టెన్ సలీమ్ మాలిక్ వ్యాఖ్యానించాడు. మొత్తం 120 బంతుల్లో 59 బంతులు డాట్స్‌గా






పడటం గమనార్హం. కీలక సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన వసీమ్ ఇమాద్ 23 బంతులు ఎదుర్కొని కేవలం 15 పరుగులు మాత్రమే చేశాడు. ఇదే మా జట్టు ఓటమికి కారణమని మాలిక్ విమర్శించాడు. "మీరు ఒకసారి వసీమ్ ఇమాద్ ఇన్నింగ్స్‌ను చూడండి. చివర్లో దూకుడుగా ఆడాల్సి ఉన్నా అలా చేయలేదు. బంతులను వృథా చేశాడు. దీంతో లక్ష్య ఛేదన కష్టంగా మారిపోయింది. ఒకవేళ కొన్ని పరుగులు చేసి ఉంటే పాక్ గెలిచేందుకు అవకాశం ఉండేది" అని మాలిక్ ఓ టీవీ కార్యక్రమంలో వ్యాఖ్యానించాడు. ఇదే చర్చలో మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది కూడా ఉన్నాడు. "పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి వాతావరణం ఉన్నట్లు అనిపించడం లేదు. కెప్టెన్ బాబర్ అజామ్‌తో సమస్యలు ఉన్నాయేమో తెలియదు. జట్టులోని ప్రతి ఒక్కరికి సారథి మద్దతుగా నిలవాలి. అంతా అతడి చేతిలోనే ఉంటుంది. జట్టును నాశనం చేయాలన్నా.. నాణ్యమైన టీమ్‌గా మార్చాలన్నా అతడికే సాధ్యం. ఈ వరల్డ్ కప్ ముగిసిన తర్వాత దీనిపై వివరంగా మాట్లాడతా. ఇప్పుడే చెబితే.. నేను షహీన్‌కు సపోర్ట్‌గా మాట్లాడుతున్నానని అనుకుంటారు. అతడు నా అల్లుడు కాబట్టే బంధుప్రీతి చూపానని వ్యాఖ్యలు చేసేవారూ లేకపోలేదు" అని అఫ్రిది వ్యాఖ్యానించాడు.

## షాట్ల ఎంపికపై ఇంత నిర్లక్ష్యమా..?

### భారత బ్యాటర్లపై సన్నీ ఆగ్రహం

టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. బౌలర్లకు సహకరించే న్యూయార్క్ పిచ్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా 119 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో పాక్ 113/7 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. భారత్ విజయం సాధించినప్పటికీ బ్యాటింగ్



చేసిన తీరుపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. "మన బ్యాటర్ల ప్రదర్శన తీవ్ర నిరాశకు గురి చేసింది. షాట్ల ఎంపికలో నిర్లక్ష్యం వహించారు. గేమ్‌ను తేలిగ్గా తీసుకున్నట్లు అనిపించింది. ప్రతి బంతిని సులువుగా కొట్టేస్తామన్న అహంభావంతో ఉన్నారు. తొలి బంతి నుంచి దూకుడుగా ఆడేద్దామని అనుకున్నట్లుంది. కానీ, ఇది ఐర్లాండ్ బౌలింగ్ ఎటాక్ కాదు. ఏదో చిన్న టీమ్ బౌలింగ్ చేసినట్లు భావించారు. ఇక్కడ ఐర్లాండ్‌ను అగౌరవపరచాలని కాదు. పాక్ వంటి అనుభవం కలిగిన డేంజరస్ బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కొనేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఇంకా ఒక ఓవర్ మిగిలి ఉండగానే ఆలౌట్ కావడం బాధపెట్టే అంశం. కనీసం మరో ఐదు లేదా ఆరు పరుగులు రాబట్టినా ప్రత్యర్థిపై ఇంకా ఒత్తిడి తెచ్చినట్లైయ్యేది.

## పాక్‌పై బుమ్రా అదుర్స్.. హార్దిక్ పాండ్య రికార్డు బద్దలు

టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్‌ను ఓడించడంలో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించాడు. మూడు వికెట్లు తీసి పాక్‌ను దెబ్బ కొట్టాడు. పొదుపైన బౌలింగ్‌తో అదరగొట్టాడు. కేవలం 120 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన పాక్ 113/7 స్కోరుకే పరిమితమైంది.



ఈ క్రమంలో బుమ్రా మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన మూడో భారత బౌలర్‌గా నిలిచాడు. బుమ్రా 64 మ్యాచుల్లో 79 వికెట్లు తీయగా.. హార్దిక్ 78 వికెట్లతో కొనసాగుతున్నాడు. వీరిద్దరూ ఈ మ్యాచ్‌కు ముందు చెరో 76 వికెట్లు తీసి సమంగా ఉన్నారు. పాక్‌పై బుమ్రా 3, హార్దిక్ 2 వికెట్లు పడగొట్టిన సంగతి తెలిసిందే. ఇక భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ మాత్రం యుజ్వేంద్ర చాహల్. మొత్తం 80 మ్యాచుల్లో 96 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్‌పై అద్భుతమైన ప్రదర్శన అనంతరం బుమ్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. "తక్కువ స్కోరును కాపాడుకోవడం చాలా ఆనందంగా ఉంది. వర్షం పడటంతో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కాలేదు. ఎండ రావడంతో పిచ్ నుంచి మరింత సహకారం లభించింది. క్రమశిక్షణతో బౌలింగ్ చేశాం. పేస్‌తోపాటు వైవిధ్యంగా బంతులేస్తే ఫలితం అనుకూలంగా ఉంటుంది. భారత్‌కు మద్దతు ఇచ్చేందుకు వచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. అదే మాకు స్ఫూర్తినిచ్చింది. ఇప్పటికే రెండు మ్యాచుల్లో విజయం సాధించాం. రాబోయే మ్యాచుల్లోనూ గెలిచి తదుపరి దశకు చేరుకుంటాం. మా ప్రణాళికలను పక్కగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. ఎప్పుడైనా సరే బ్యాట్ ,బంతి పోటీ చూడటానికి చాలా బాగుంటుంది. ఎప్పుడైతే బ్యాటింగ్‌దే పైచేయి అవుతుందో.. ఇక నేను టీవీ కట్టేసివాడిని. చిన్నప్పటి నుంచి బౌలింగ్ జట్టుకే అభిమానిని" అని బుమ్రా తెలిపాడు.

IRS PUBLICATIONS, 13-2-819-2, RAMBO RESIDENCE, RTC BUS STAND ROAD, SRINIVAS NAGAR, ANANTAPUR ANANTAPUR, ANDHRA PRADESH, 515001 GSTIN: 37AAJFI5233N1ZY TEL:7672042522 - EDITOR : M. IRSHADBEG - CELL - 918500425222.